నార్త్ సిటీ మెట్రో సాధనకు పోరాటం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నార్త్ సిటీ మెట్రో సాధనకు ప్రజల తరఫున పోరాడుతామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. నగరంలోని బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 69 కిలోమీటర్ల మేర మెట్రోను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. అంతేగాకుండా ఎంతో ముందుచూపుతో రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రోను తీసుకెళ్లాలని నిర్ణయించారన్నారు. నాడు మెట్రో రెండో దశ పనులకు రూ. 24 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో కేవలం రూ. 11 కోట్లు పెట్టిందన్నారు. అలాగే సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట్, ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి, సుచిత్ర, కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు మెట్రో రైల్‌ను విస్తరించేందుకు పెట్టిన ప్రతిపాదనలను కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రద్దు చేసిందన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా మోసం చేసినట్లుగానే మెట్రో రద్దుతో కుత్బుల్లాపూర్, మేడ్చల్, అల్వాల్, కుత్బుల్లాపూర్ ప్రజలను కూడా మోసం చేసిందని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా నార్త్ సిటీ మెట్రో రద్దును ఉపసంహరించుకోకుంటే ప్రజలతో కలిసి నిరసనలు చేపడుతామని హెచ్చరించారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి


మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నిర్వాహకులు

కుత్బుల్లాపూర్: అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. నియోజకవర్గంలోని పలువురు ప్రజలు, సంక్షేమ సంఘాల నేతలు గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు ఫోన్లు చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు.

గాజులరామారం డీఈకి వినతిపత్రం

కుత్బుల్లాపూర్: సీపీఎం సూరారం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గాజులరామారం సర్కిల్ డీఈ శిరీషకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు పసుల అంజయ్య, రావుల స్వాతి, నాయకులు సంజీవరాజు, అంబయ్య, కృష్ణ, లక్ష్మి, దుర్గానాయక్, యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డీఈ శిరీషకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

మద్దాలకుంట చెరువును పరిరక్షించాలి


డీటీ మల్లికార్జున్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్: గాజులరామారం సర్వే నంబర్ 335లోని మద్దాల కుంట చెరువును కబ్జా చెర నుంచి కాపాడాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో డీటీ మల్లికార్జున్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు ఆకుల సతీశ్ మాట్లాడుతూ 11.70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మద్దాల చెరువు 8 ఎకరాల మేర ఆక్రమణలకు గురైందని, కబ్జాదారులు మట్టి, రాళ్లు పోసి ఎఫ్‌టీఎల్‌ను కబ్జా చేసి ఫామ్‌హౌజ్‌లు, ప్రహరీలు నిర్మిస్తున్నా ఇరిగేషన్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రగతినగర్ నుంచి మద్దెల చెరువుకు వచ్చే నాలా కబ్జాలు, మద్దెల చెరువు నుంచి పరికిచెరువు వెళ్లే నాలా ఆక్రమణలను తొలగించి చెరువును పరిరక్షించాలని కోరామన్నారు. నాయకులు చందు, అరుణ్ రావు, ఈశ్వర్ రెడ్డి, మాధవరావు, శ్యామ్ కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

కూకట్‌పల్లి: రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. విజ్ఞానపురి కాలనీ ప్రజల ఫిర్యాదు మేరకు నిర్మాణాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 39 మంది లబ్ధిదారులకు రూ. 16,94,500 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, సంతోష్, ప్రభాకర్, ఈఈ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


విజ్ఞానపురికాలనీలో రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

బాలానగర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. బాలానగర్ ఎక్సైజ్ సీఐ వేణుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాలకు చెందిన వెంకటేశ్ (24) ఎం తరుణ్ ఇద్దరు స్నేహితులు. వీరు ఒడిస్సాలో గంజాయిని కొనుగోలు చేసి ఫతేనగర్ పరిసరాల్లో అమ్మేందుకు వస్తుండగా బాలానగర్ ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. వారి నుంచి 4 కిలోల 962 గ్రాముల గంజాయిని, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచారు.


నిందితులతో ఎక్సైజ్ పోలీసులు


వేంకటేశ్వరనగర్ బీపీఎస్ ఒలింపియాడ్ స్కూల్‌లో..


అపురూప కాలనీ టీవీఆర్ మోడల్ హైస్కూల్‌లో..

బతకుమ్మ..బతుకమ్మ ఉయ్యాలో..

నియోజకవర్గవ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం రెండోరోజు మహిళలు రంగురంగల పూలతో బతుకమ్మలను పేర్చి గౌరీదేవి అటుకులను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం మహిళలు, యువతులు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడి పాడారు.

– కుత్బుల్లాపూర్


దండమూడి ఎన్‌క్లేవ్‌లో బతుకమ్మలతో మహిళలు


సుభాష్‌నగర్ బోధి వృక్ష ఒలింపియాడ్ స్కూల్‌లో..


సుచిత్ర వేంకటేశ్వర ఎన్‌క్లేవ్‌లోని గన్‌పార్కులో..


జగద్గిరిగుట్టలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న మహిళలు

మాజీ మేయర్‌కు ఆహ్వానపత్రిక అందజేత


మేయర్‌కు ఆహ్వానపత్రం అందిస్తున్న కాలనీవాసులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ 14వ డివిజన్‌కు చెందిన సాయి బృందావనం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సీనియర్ నేత వెంగయ్యచౌదరి ఆధ్వర్యంలో గురువారం మేయర్ కొలన్ నీలారెడ్డిని కలిశారు. దుర్గామాత పూజలకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. స్థానిక డివిజన్ అధ్యక్షుడు బొబ్బ శ్రీనివాస్, స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

ట్రాఫిక్ మళ్లింపు

నిజాంపేట్: మల్లంపేట్ బస్టాప్ నుంచి హనుమాన్ ఆలయం వరకు రోడ్డు పనుల నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లిస్తూ సైబరాబాద్ జాయింట్ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 20 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నాయి. బాచుపల్లి నుంచి ఓఆర్ఆర్ ఎగ్జిట్-4ఏ కు వెళ్లే వాహనదారులు మల్లంపేట్ బస్టాప్ నుంచి ఎడమవైపు ఖాజీపల్లి- బొల్లారం రోడ్డులోని బీసీ కాలనీ మీదుగా ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి ఎగ్జిట్-4 కు చేరుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా ఓఆర్ఆర్ ఎగ్జిట్-4ఏ నుంచి బాచుపల్లికి వచ్చే వాహనదారులు మల్లంపేట్ ఎంట్రన్స్‌లో ఎడమవైపు తిరిగి ఖాజీపల్లి-బొల్లారం రోడ్డులోని బీసీ కాలనీ నుంచి మల్లంపేట్ బస్టాప్ అక్కడ నుంచి కుడి వైపు నుండి బాచుపల్లికి చేరుకోవాల్సి ఉంటుంది. వాహనదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పర్షియన్, సంస్కృత భాషలకు సమ ప్రాధాన్యం


సదస్సులో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: మొఘలులు పర్షియన్, సంస్కృత భాషలను సమానంగా ప్రోత్సహించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయని ఢిల్లీ విశ్వవిద్యాలయం చరిత్ర ప్రొఫెసర్ ఫర్హత్‌హసన్ గుర్తు చేశారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇస్లామిక్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'చరిత్ర, ముస్లిం చరిత్రకారులు: భారతీయ దృక్పథం' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని అభివృద్ధిలో అత్యంత ముఖ్యమైనది అక్షరాస్యతను విస్తరించడం, ప్రోత్సహించడమని గుర్తు చేశారు. మొఘల్ శకంలో ముఖ్యమైన సహకారాన్ని హైలైట్ చేశారు. చరిత్రకారుడు మన్నన్ ఆసిఫ్ పనితీరును ప్రస్తావిస్తూ 'తారీఖ్ ఏ ఫరిష్తా', 'ఐన్ ఏ అక్బరీ' వంటి పర్షియన్ సాహిత్యం భారతదేశాన్ని సహనం, బహుళ సాంస్కృతికత, సమ్మిళిత ప్రదేశంగా ఎలా సూచిస్తుందో వివరించారు. అనంతరం ప్రొఫెసర్ ఫహీమ్ అక్తర్ నద్వీ సంపాదకత్వం వహించిన ఇటీవలి సెమినార్‌ల ప్రొసీడింగ్స్‌ను ప్రొఫెసర్ ఫర్హత్‌హసన్ విడుదల చేశారు. ఇదిలా వుండగా ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ సెమినార్ పేపర్లను ప్రచురించమని డిపార్ట్‌మెంట్‌ను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ సిరాజుద్దిన్, డాక్టర్ అతీఫ్ ఇమ్రాన్ ప్రసంగించారు. పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, చరిత్రకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దశలవారీగా అన్ని సమస్యలకు పరిష్కారం

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో నెలకొన్న అన్ని సమస్యలకూ దశలవారీగా పరిష్కారం చూపుతామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులను వివరించిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి గురువారం ఆయనను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ... అన్ని రంగాలలో గచ్చిబౌలి డివిజన్‌ను అభివృద్ధి చేసి ఆదర్శ డివిజన్‌గా మార్చాలనే సంకల్పంతో పనిచేద్దామని సూచించారు. మంచినీటి సరఫరాలో అంతరాయం లేకుండా మెరుగైన నీటి సరఫరా చేయాలని, అవసరమైన చోట మంచినీటి సరఫరా సమయం పెంచేలా చూస్తామన్నారు. బీజేపీ జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హన్మంతునాయక్, నాయకులు జలేందర్‌రెడ్డి, కృష్ణమూర్తి, వినోద్, అశోక్‌గౌడ్, యాదగిరి, వినోద్‌రావు, నకుల్, దొరబాబు, శేఖర్, ప్రసాద్, సుమన్ పాల్గొన్నారు.



హెచ్ఎంటీ ఖాళీ స్థలంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలి

జగద్గిరిగుట్ట: హెచ్ఎంటీ ఖాళీ స్థలంలో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు సహకరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేశ్ అన్నారు. ఈ మేరకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డితో కలిసి సచివాలయంలో రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇతర జిల్లాలకు చెందిన సుమారు 50 బస్సులు ప్రతిరోజు రాత్రి నిలిపిఉంటాయని దీంతో డ్రైవర్లు, కండక్టర్లకు కనీస సౌకర్యాలు లేకపోగా, ఇప్పుడున్న బస్టాప్ నిత్యం రద్దీతో ఉంటుందన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నర్సింహ, సమితి సభ్యులు ఏసురత్నం, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంటమాలాజీ, శానిటేషన్ సిబ్బందికి వైద్యశిబిరం


శానిటరీ సిబ్బందిని పరీక్షిస్తున్న వైద్యులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఎంటమాలజీ, శానిటేషన్ సిబ్బందికి పద్మానగర్ ఫేజ్-2లోని కమిటీ హాల్‌లో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గైనకాలజీ మహిళా కార్మికులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే విధుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

దసరాకు స్పెషల్ బస్సులు

జీడిమెట్ల: బతుకమ్మ, దసరా పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం జీడిమెట్ల డిపో నుంచి స్పెషల్ బస్సులు నడపనున్నట్లు డీఎం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల, నిర్మల్, ఆర్మూర్, నిజామాబాద్, కరీంనగర్, కోదాడ, ఖమ్మం, తదితర ప్రాంతాలకు నడపనున్నటుల, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

గొడవ ఆపేందుకు వెళ్లగా దాడి

దుండిగల్: గొడవ పడుతున్న విద్యార్థులను ఆపేందుకు వెళ్లగా మరో ఇద్దరి విద్యార్థులపై దాడి చేసిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలోని క్యాంటీన్‌లో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థుల మధ్య గురువారం వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఇద్దరు విద్యార్థులు కళాశాల వెలుపలికి వచ్చి గొడవ పడ్డారు. దీంతో వారించేందుకు యత్నించిన మరో ఇద్దరు విద్యార్థులపై దాడికి దిగి గాయపరిచారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొల్లపూడి పున్నారావుకు నాన్‌బెయిలబుల్ వారెంట్

రిమాండ్‌కు తరలించిన కూకట్‌పల్లి కోర్టు

సిటీ కోర్టులు: వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ ప్రొప్రైటర్ గొల్లపూడి పున్నారావుకు కూకట్‌పల్లి 13వ అడిషనల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేసింది. నిచినో ఇండియా ప్రై.లి. కంపెనీ 2016 నుంచి హైదరాబాద్‌లో కెమికల్, ఫర్టిలైజర్ వ్యాపారం నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగానే ఆయా కంపెనీలకు ఫర్టిలైజర్ రసాయన మందులు తదితర మెటీరియల్‌ను సరఫరా చేస్తుంటారు. అయితే కొంతకాలం క్రితం పరిచయం ఆయిన గొల్లపూడి పున్నారావు నిత్యం నిచినో ఫర్టిలైజర్ కంపెనీ నుంచి రసాయన మందులు తీసుకెళ్తుండేవాడు. ఈ రసాయాలకు సంబంధించిన అమౌంట్ రూ. 19, 94 లక్షలు చెల్లించాల్సి ఉండగా చెక్ ఇచ్చారు. ఈ చెక్‌ను నిచినో ఫర్టిలైజర్ ప్రొప్రైటర్ పి.నర్సింగ రావు చెక్‌ను బ్యాంక్‌లో డిపాజిట్ చేయగా బౌన్స్ అయ్యింది. అనంతరం పున్నారావు సంప్రదించకపోవడంతో నర్సింగరావు తరఫున న్యాయవాది కూకట్‌పల్లి కోర్టులో చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశారు. కోర్టు నోటీసులు పంపినా రాకపోవడంతో నాన్ బెయిబుల్ వారెంట్‌ను కోర్టు జారీ చేసింది. దీంతో పోలీసులు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఉన్న పున్నారావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణ చేపట్టిన కోర్టు ఆయనను రిమాండ్ తరలించింది. అనంతరం పున్నారావు తరఫున న్యాయవాది బెయిల్‌పిటిషన్ దాఖలు చేయడంతో గురువారం విడుదల అయ్యాడు.

మురుగు పరుగు..!

- రెండేళ్లుగా ఇదే తంతూ
- ఇబ్బందుల్లో స్థానికులు
- పట్టని అధికారులు

కుత్బుల్లాపూర్: రోడ్డుపై మురుగు పరుగు పెడుతూనే ఉంది. దీంతో రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో ఆ ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫిర్యాదు చేసిన సమయంలో హడావుడి చేసే అధికారులు, ప్రజాప్రతినిధులు ఆపై సమస్యను పట్టించుకోకుండా కాలం వెల్లదీయడంతో రెండేళ్లుగా ఎక్కడ సమస్య అక్కడే అన్న చందంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. కొంపల్లి మున్సిపల్ పరిధి సినీ ప్లానెట్ నుంచి జయభేరి కాలనీకి వెళ్లే దారిలో కేవీఆర్ గార్డెన్ సమీపంలో డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి నిత్యం మురుగు పారుతోంది.. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలు సాగించాలంటేనే వాహనదారులు, పాదాచారులు జంకుతున్నారు. ఈ విషయమై పలుమార్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ దృష్టికి తీసుకువెళ్లినా తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టడంతో కొద్ది రోజులకే సమస్య యథాతథంగా మారుతోంది.


కొంపల్లి సినీ ప్లానెట్-జయభేరి కాలనీ రోడ్డుపై పారుతున్న మురుగునీరు

కాలనీలోని మురుగునీరు..

కేవీఆర్ గార్డెన్ సమీపంలో లీకవుతున్న మురుగునేరుగా సమీపంలోని మన భూమి విల్లాస్‌లోకి వెళ్తోంది. రోజుల తరబడి మురుగు నిల్వ ఉండడంతో స్థానికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు దోమలు వృద్ధి చెంది ఇప్పటికే పలువురు డెంగీ, చికెన్‌గున్యా తదితరవిష జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలైన ఘటనలు ఉన్నాయి.

డ్రైనేజీ లైన్ ఏర్పాటుకు తీర్మానం చేసినా అంతే..

పాడైన పాత డ్రైనేజీ లైన్ స్థానంలో కొత్త పైపులైన్‌ను వేసి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించారు. దీంతో కొద్ది నెలల క్రితం రూ.40 లక్షల నిధులు వేయించారు. అయితే ఇప్పటివరకు పనులు మాత్రం ప్రారంభం కాలేదు.


కేవీఆర్ గార్డెన్ వద్ద డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి ఉబికి వస్తున్న మురుగు

మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం..



డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంలో అటు కమిషనర్ శ్రీహరి, చైర్మన్ శ్రీశైలంయాదవ్ శ్రద్ధ చూపడం లేదు. నిధులు కేటాయించామని చెప్పి నెలలు కావస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. అధికారులకు ఫిర్యాదు చేసి కాలనీ ప్రజలు విసుగు చెందారు. కాలనీ వాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

– శివాజీరాజు, బీజేపీ నియోజకవర్గ కో, కన్వీనర్

దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం

కుత్బుల్లాపూర్: నియోజకవర్గవ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారిని బాలత్రిపుర సుందరి దేవీగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ప్రాంతాల్లోని అమ్మవార్ల ఆలయాలు, మండపాల్లో జరిగిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


కుత్బుల్లాపూర్ వేణుగోపాలస్వామి ఆలయంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు, కుటుంబ సభ్యులు


ధూలపల్లిలోని పీఏసీఎస్ గోదాములో పీఏసీఎస్ చైర్మన్ గరిసె నరేందర్‌రాజు..


నిజాంపేట్‌లోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో టెంపుల్ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్‌రెడ్డి..


గాజులరామారం చిత్తారమ్మ ఆలయంలో కూన అంతయ్యగౌడ్ కుటుంబ సభ్యులు..